# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
11-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 51

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## ఆ పెద్ద మనసుతో సహకరించండి:
# మోదీకి రేవంత్ విజ్ఞప్తి

తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి వినతి

గుజరాత్ మోడల్ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ సహకరించినట్టే తనకు మద్దతివ్వాలని విజ్ఞప్తి

2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని హామీ

రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షించాలని మనవి

తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్ఐసీసీలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి హిందీలో ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించారు. దేశాభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తామని స్పష్టం చేస్తూనే, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ప్రధాని ముందుంచారు.కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడూ

- మిగతా 2వ పేజీలో



- మిగతా 2వ పేజీలో

# తెలంగాణలో మోదీ పర్యటన అదుర్స్!

అభివృద్ధి కావాలంటే తమతో కలిసి రావాలంటే సీఎం రేవంత్ కు పిలుపు

గుజరాత్ తరహాలో అభివృద్ధి చేస్తామని సంకేతం

పేరుకే అభివృద్ధి పనుల శ్రీకారం

రాజకీయం లేదంటూనే.. పక్కా పొలిటికల్ వ్యూహం

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన సర్వత్రా ఆసక్తి రేపింది. పశ్చిమ బెంగాల్లో కాషాయ జెండా ఎగురవేసిన తరుణంలో.. వెంటనే తెలంగాణలో వాలిపోయారు ప్రధాని నరేంద్ర మోడీ. కానీ తెలంగాణలో రాజకీయ విరుద్ధ ప్రభుత్వం ఉంది. అయినా సరే తెలంగాణ



## ఏడాది పాటు ప్రజలు బంగారం కొనొద్దు: ప్రధాని మోదీ

సికింద్రాబాద్ సభలో ప్రధాని మోదీ ప్రసంగం

ప్రపంచ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు సహకరించాలన్న ప్రధాని

ఇంధనాన్ని పొదుపు చేసి, ప్రజా రవాణాను ఎక్కువగా వినియోగించాలని సూచన

వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తిరిగి ప్రారంభించి, అనవసర ప్రయాణాలు తగ్గించాలని సలహా

విదేశీ యాత్రలు, బంగారం కొనుగోళ్లు కొంతకాలం వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి

## ఇక బరువు తగ్గొద్దు లోకేశ్..

ప్రధాని మోదీ సరదా సూచన!

హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ప్రధాని మోదీకి తేనీటి విందు

ఫిట్‌నెస్ విషయంలో మోదీయే తనకు స్ఫూర్తి అన్న లోకేశ్

మోదీ, చంద్రబాబు ఇద్దరూ తనకు మెంటార్లేనని వెల్లడి

రాష్ట్రానికి అందిస్తున్న సాయానికి మోదీకి కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు

# ఇంటర్ అడ్మిషన్లు పాత పద్ధతిలోనే..

పాఠశాల విద్యలో ఇంటర్‌బోర్డు విలీనంపై నిర్ణయం వాయిదా

సమయం లేకపోవడం.. సంస్కరణలకు మరింత సమయం అవసరం

దీంతో ఈ ఏడాది పాత పద్ధతిలోనే అడ్మిషన్లు చేపట్టాలని సీఎం నిర్ణయం

పాఠశాల విద్యాశాఖ అధికారుల సమీక్షలో రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

3లో




# తమిళ సీఎంగా విజయ్ ప్రమాణం

చెన్నైలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం

మంత్రులుగా తొమ్మిది మంది ప్రమాణ స్వీకారం

- వాగ్దానాల అమలుకు వేదికపైనే విజయ్ శ్రీకారం
- ఉచిత విద్యుత్, మహిళల భద్రత, డ్రగ్స్ కట్టడిపై మూడు సంతకాలు
- పాలనలో నూతన శకం మొదలైందని ప్రకటన
- ప్రజల రుణం తీర్చుకోవడానికొచ్చా.. ప్రజాధనం ముట్టుకోబోనని ప్రతిన
- రాష్ట్రంలో శాంతి భద్రతలపై సీఎం హోదాలో తొలి సమీక్ష
- ప్రొటెం స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే కరుప్పయ్య ప్రమాణం
- నేడు నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

2లో

## ఆ మూడు ఫైళ్లపై విజయ్ సంతకం!

ఇకనుంచి తమిళనాడులో 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం

మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ రెండో సంతకం

డ్రగ్స్ నియంత్రణ పై మూడో సంతకం

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. తాను హామీ ఇచ్చిన మాదిరిగా మూడు ముఖ్యమైన ఫైళ్లపై సంతకం చేశారు. అందులో ప్రధానమైనది 200 యూనిట్ల వరకు



## అమెరికా ప్రతిపాదనలపై
# చర్చకు ఓకే

ఇరాన్ అంగీకారం

డ్రోన్ దాడితో ఖతార్ జలాల్లో నౌకకు నిప్పు

దుబాయ్/ఇస్లామాబాద్: అమెరికా అందజేసిన 14 సూత్రాల ప్రతిపాదనపై చర్చలకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం పాకిస్తాన్‌కు ప్రతినిధులను పంపించేందుకు అంగీకరించింది. ఈ మేరకు మధ్యవర్తిగా ఉన్న పాక్‌కు సమాచారం పంపినట్లు ఇరాన్ అధికార వార్తా సంస్థ వెల్లడించింది. అయితే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

3లో

## ఖజానా ఖాళీ" అని అప్పుడే సాకులు చెప్పొద్దు... విజయ్‌కు స్టాలిన్ చురకలు!

తమిళనాడు నూతన సీఎం విజయ్‌కు మాజీ సీఎం స్టాలిన్ అభినందనలు

రూ.10 లక్షల కోట్ల అప్పు ఆరోపణలను ఖండించిన స్టాలిన్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే విజయ్ హామీలు ఇచ్చారని విమర్శ

త్వరలోనే పాలనలోని సూక్ష్మాలను నేర్చుకుంటారని ఆశిస్తున్నట్లు వ్యాఖ్య

## రేపట్నుంచి పెరగనున్న ఉష్ణోగ్రతలు



3లో

# తమిళ సీఎంగా విజయ్ ప్రమాణం




చెన్నై: తమిళనాడులో ద్రవిడ పార్టీల పరిపాలనా పర్వానికి తెరదించుతూ తమిళగ వెట్రి కళగం(టీవీకే) చీఫ్ సి.జోసెఫ్ విజయ్ ఆదివారం నూతన ప్రభుత్వాన్ని కొలువుతీర్చారు. ఆత్మీయులు, కుటుంబసభ్యులు, వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గత 60 ఏళ్ల తమిళనాడు చరిత్రలో డీఎంకే, అన్నాడీఎంకే ప్రమేయం లేని ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఉదయం 10.15 గంటలకు అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం ఆరంభమైంది. విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ముఖ్యమంత్రిగా ప్రమాణంచేయించారు. టీవీకేలోని 9 మంది నేతలు మంత్రులుగా ప్రమాణంచేశారు. టీవీకే ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ సైతం భాగస్వామిగా చేరిన నేపథ్యంలో ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేకంగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి విజయ్ తల్లిదండ్రులు ఎస్.ఎ.చంద్రశేఖర్, శోభ, తమిళనాడులో బీజేపీ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్, సినీ నటి త్రిష, వామపక్ష పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలు ముందువరసలో కూర్చుని ప్రమాణస్వీకారాన్ని చూశారు. పలువురు ప్రముఖులు, తమిళ సినీతారలు, టీవీకే నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అభిమానుల 'విజిల్' మోతలు, 'సీఎం విజయ్', 'దళపతి' నినాదాలతో ఇండోర్ స్టేడియం మార్మోగిపోయింది. విజయ్ తన మంత్రివర్గంలో యువత, అనుభవజ్ఞులకు ప్రాధాన్యమిచ్చారు. సీఎంగా ప్రమాణంచేశాక విజయ్ ఉద్వేగంగా ప్రసంగించారు. నిజమైన లౌకికవాదం, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండే పాలనకు సంబంధించిన నూతన శకం ఇప్పుడే ప్రారంభమైందని స్పష్టంచేశారు.

**తనదైన శైలిలో ప్రమాణం చేయబోయి..**

విజయ్‌తో సీఎంగా ప్రమాణం చేయించేందుకు ఆయనను పోడియం వద్దకు గవర్నర్ ఆహ్వానించారు. 'నేను' అని గవర్నర్ అందివ్వగా అధికారికంగా ఇచ్చిన ప్రమాణపత్రాన్ని కాదని సొంతంగా తనదైన శైలిలో ప్రమాణంచేసేందుకు విజయ్ ప్రయ తి?నంచారు. వెంటనే గమనించిన గవర్నర్ సున్నితంగా అడ్డుకుని రాజ్యాంగంలో పేర్కొన్న శైలిలోనే ప్రమాణం చేయాలని సూచించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో గాయకులు వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను ఆలపించడం విశేషం. సాధారణంగా అధికారిక కార్యక్రమంలో మొదటి రెండు చరణాలను ఆలపిస్తారు. అయితే, మొత్తం ఆరు చరణాలను ఆలపించాలంటూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ప్రమాణ స్వీకార వేడుకలో తమిళ తల్లి గీతం.. తమిళ్ తాయ్ వాళ్తుకు మూడో స్థానం కల్పించడాన్ని సీపీఐ, డీఎంకేలు తీవ్రంగా పరిగణించాయి. వందేమాతరం, జనగణమన అనంతరం తమిళ్ తాయ్ వాళ్తు గీతాన్ని ఆలపించారు. ప్రాధాన్యతా క్రమంలో తమిళ గీతానికి మూడోస్థానం కల్పించడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీర పాండియన్, వీసీకే అధినేత థోల్ తిరుమావళవన్‌తోపాటు సీపీఎం, ఐయూఎంఎల్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు.

# ఏడాది పాటు ప్రజలు బంగారం కొనొద్దు: ప్రధాని మోదీ

రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సహజ వ్యవసాయం వైపు మళ్లాలని పిలుపు ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా తలెత్తిన ప్రపంచ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి దేశ ప్రజలు కొన్ని త్యాగాలు చేయాలని కోరారు. ఇంధనాన్ని పొదుపు చేయడం, ప్రజా రవాణాను ఉపయోగించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తిరిగి ప్రారంభించడం, అనవసర వస్తువుల కొనుగోళ్లు, విదేశీ పర్యటనలు మానుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్ల జోలికి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు.

**ఐక్యంగా పోరాడదాం**

అంతర్జాతీయ ఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయని, ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజలందరి సమష్టి భాగస్వామ్యం అవసరమని నొక్కి చెప్పారు. కష్ట సమయాల్లో దేశం కోసం బాధ్యతాయుతంగా జీవించడం, మన కర్తవ్యాలను నెరవేర్చడం కూడా దేశభక్తేనని ఆయన అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేయడమే కాదు, దేశం కోసం జీవించడం కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. "ప్రస్తుత పరిస్థితుల్లో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడంపై మనం ప్రత్యేక దృష్టి పెట్టాలి. మనమందరం కలిసికట్టుగా ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

**ఇంధన పొదుపు అత్యవసరం**

ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని, వాటి కొనుగోలుకు వెచ్చిస్తున్న విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం మనందరి బాధ్యత అని ప్రధాని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న చోట మెట్రో రైలు, ఇతర ప్రజా రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేట్ వాహనాలు అవసరమైనప్పుడు కార్‌పూలింగ్ విధానాన్ని ఎంచుకోవాలని కోరారు. సరుకు రవాణాకు రైల్వేలను ఎక్కువగా ఉపయోగించాలని, వీలైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని పెంచాలని సూచించారు.

**కొవిడ్ నాటి పద్ధతులు పునరుద్ధరించాలి**

దేశ ప్రయోజనాల దృష్ట్యా కరోనా మహమ్మారి సమయంలో పాటించిన కొన్ని పద్ధతులను తిరిగి ప్రారంభించాలని ప్రధాని కోరారు. వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌ల వంటి విధానాలకు మళ్లీ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "కరోనా సమయంలో మనం ఈ పద్ధతులకు అలవాటు పడ్డాం. ఇప్పుడు వాటిని పునరుద్ధరించడం దేశానికి ఎంతో అవసరం" అని ఆయన అన్నారు.

**విదేశీ ప్రయాణాలు, కొనుగోళ్లు వాయిదా**

విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడేందుకు ప్రజలు అనవసరమైన విదేశీ ప్రయాణాలు, విదేశాల్లో విహారయాత్రలు, పెళ్లిళ్లు వంటివి మానుకోవాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని, వేడుకలను భారతదేశంలోనే జరుపుకోవాలని కోరారు. అలాగే, కనీసం ఒక సంవత్సరం పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లను నివారించాలని సలహా ఇచ్చారు. "మేడ్-ఇన్-ఇండియా" ఉత్పత్తులకే ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా బూట్లు, బ్యాగులు వంటి రోజువారీ వస్తువులను స్థానికంగా తయారైనవే కొనాలని సూచించారు.

**రైతులకు, కుటుంబాలకు సూచనలు**

ప్రతి కుటుంబం వంట నూనె వినియోగాన్ని తగ్గించుకోవాలని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని ప్రధాని హితవు పలికారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని 50 శాతం తగ్గించాలని, సహజ వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లాలని కోరారు. దీనివల్ల భూసారం పెరగడంతో పాటు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వివరించారు. డీజిల్ పంపులకు బదులుగా సౌరశక్తితో నడిచే పంపుసెట్లను ఎక్కువగా వినియోగించుకోవాలని ఆయన రైతులను ప్రోత్సహించారు.ప్రపంచవ్యాప్తంగా ఎరువుల బస్తా ధర సుమారు రూ. 3,000 ఉండగా, భారత ప్రభుత్వం రైతులకు కేవలం రూ. 300 లోపే అందిస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా తనపై వేసుకుంటోందని, అయితే సంక్షోభం తీవ్రంగా ఉన్నందున ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు. "భారతమాతను ప్రథమ స్థానంలో నిలిపి, మనమందరం ఐక్యంగా పోరాడాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

# ఖజానా ఖాళీ" అని అప్పుడే సాకులు చెప్పొద్దు... విజయ్‌కు స్టాలిన్ చురకలు!

తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూనే, తీవ్రమైన రాజకీయ విమర్శలతో కూడిన హెచ్చరికలు జారీ చేశారు. "తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మీరు సంతకం చేసిన ఉత్తర్వులను కూడా నేను స్వాగతిస్తున్నాను. అయితే, వస్తూనే ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని మాట్లాడటం మొదలుపెట్టవద్దు. అవన్నీ ఉన్నాయి. ప్రజలకు ఇవ్వాలన్న మనసు, పరిపాలనా దక్షత మాత్రమే కావాలి. గత ఐదేళ్లలో మేము కోవిడ్, వరదలు వంటి ఎన్నో సమస్యలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వివక్షను ఎదుర్కొని లెక్కలేనన్ని ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశాం.'గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పు చేసి, ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయింది' అని మీ మొదటి ప్రసంగంలోనే ఆరోపించారు కదా. తమిళనాడు అప్పులు అనుమతించిన పరిధిలోనే ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి గత ఫిబ్రవరి బడ్జెట్‌లోనే మేము స్పష్టంగా చెప్పాం. ఆ విషయం మీకు తెలియదా? ఆ తర్వాతే కదా మీరు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చింది? మీకు ఓటు వేసిన ప్రజలను మళ్లీ తప్పుదోవ పట్టించి మోసం చేయకండి.'ఆచరణ సాధ్యమైన వాటినే హామీలుగా ఇస్తాను' అని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనలోకి అడుగుపెడుతున్నారు. త్వరలోనే, మాలాగా మీరు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలనే మెలకువలను నేర్చుకుంటారని నేను నమ్ముతున్నాను. ఓటు వేసిన ప్రజలతో పాటు, నేను కూడా అదే ఆశిస్తున్నాను.మీ పాలనలో తమిళనాడు అభివృద్ధి ప్రయాణం కొనసాగాలని మరోసారి ఆకాంక్షిస్తూ, నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అంటూ స్టాలిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# తెలంగాణలో మోదీ పర్యటన అదుర్స్!

గడ్డపై ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం లభించింది. కాంగ్రెస్ పాలిత సీఎం రేవంత్ రెడ్డి తో పాటు ఆ పార్టీ యావత్తు ప్రధాని మోడీకి శిరసావహించింది. అయితే ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రతిపాదనలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తమతో కలిసి వస్తే పని చేసేందుకు సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. రాజకీయ వర్గాల్లో ఇది ప్రకంపనలు రేపుతోంది.

**రాజకీయాలు మాట్లాడునంటూనే చురకలు..**

తెలంగాణలో కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు ప్రధాని నరేంద్ర మోదీ. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. పరేడ్ గ్రౌండ్ లో జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణ సీఎం రేవంత్ రాజకీయాలు మాట్లాడబోనని చెప్పారని గుర్తు చేశారు. అయితే తాను సైతం రాజకీయాలు మాట్లాడనని మోడీ తేల్చి చెప్పారు. గత పది సంవత్సరాల్లో గుజరాత్ కి ఎక్కువ నిధులు ఇచ్చారని ఆరోపిస్తున్నారని.. కానీ గుజరాత్ రాష్ట్రానికి ఎంత నిధులు ఇచ్చామో.. అదే స్థాయిలో తెలంగాణకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తేల్చి చెప్పారు ప్రధాని నరేంద్ర మోడీ. వాస్తవానికి గుజరాత్ తరహాలో చేస్తే తెలంగాణకు సగం నిధులే వస్తాయని.. ఈ నిధులు ఎటు చాలు అని అభిప్రాయపడ్డారు. అందుకే వీలైనంత ఎక్కువ నిధులు తెచ్చుకొని తెలంగాణను అభివృద్ధి చేయాలనుకుంటే రేవంత్ మాతో కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. ఒక్కమాటలో చెప్పాలంటే రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మోడీ మాట్లాడిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. రైట్ పర్సన్ బట్ రాంగ్ పార్టీ అన్నట్టు మాట్లాడారు ప్రధాని మోడీ. అభివృద్ధిలో మీరు ఎక్కడికి చేరాలనుకుంటున్నారు అక్కడికి చేరలేదు. రాజకీయంగా కాదు.. అభివృద్ధిలో నాతో కలవండి అంటూ ప్రధాని నరేంద్ర మోడీ రేవంత్ రెడ్డికి ఇచ్చిన పిలుపు ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో సరికొత్త చర్చకు దారితీస్తోంది. అయితే కేవలం తనతో రాజకీయంగా కాకుండా అభివృద్ధి పరంగానే కలవాలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేకంగా చెప్పడం గమనార్హం.

**తెలంగాణ వికాసం పై ఫోకస్..**

తెలంగాణ వికసిస్తే దేశం కూడా వికసిస్తుంది అని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించడం ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో సరికొత్త చర్చకు దారి తీస్తోంది. తెలంగాణ లో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. అది కాంగ్రెస్ పాలిత రాష్ట్రం. అయితే తెలంగాణలో అభివృద్ధి పరంగా తన మార్కు చూపించాలని భావిస్తున్నట్టు ఉన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. తెలంగాణ తెచ్చిన పార్టీగా గులాబీ పార్టీని ప్రజలు ఆదరించారు. రెండుసార్లు ఆ పార్టీకి అవకాశం ఇచ్చారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీని సైతం ఓ చాన్స్ ఇచ్చారు తెలంగాణ ప్రజలు. అయితే ఇప్పుడు అభివృద్ధి పరంగా తన మార్కు చూపించి తెలంగాణలో అధికారంలో రావాలన్నది భారతీయ జనతా పార్టీ అభి మతం. ఎటువంటి రాజకీయ ఘర్షణ లేకుండా.. ఎటువంటి రాజకీయాలకు తావు లేకుండా.. కేవలం అభివృద్ధి అజెండా అన్న కోణంలో తెలంగాణలో అధికారంలోకి రావాలన్నది బిజెపి అభిప్రాయంగా.. ప్రధాని నరేంద్ర మోడీ సంకేతాల ద్వారా తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనలో.. రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న కాంగ్రెస్ పార్టీతో పాటు గులాబీ పార్టీపై ఎటువంటి విమర్శలు చేయలేదు. గుజరాత్ తరహాలో తెలంగాణ అభివృద్ధి కావాలంటే తమతో అడుగులు వేయాలని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు వెనుక లోతైన ఆలోచన ఉంది. ప్రజలు కచ్చితంగా అభివృద్ధి కోసం ఆలోచిస్తారు. ప్రధాని నరేంద్ర మోడీ అదే అభిప్రాయంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని గౌరవిస్తూనే.. తమతో కలిసి రావాలని పిలుపునివ్వడం ద్వారా తెలంగాణ ప్రజల్లో ఒక రకమైన ఆలోచనను రేకెత్తించారు. మొత్తానికి అయితే మోడీ పర్యటన కేవలం భారతీయ జనతా పార్టీకే కాదు. మిగతా రాజకీయ ప్రత్యర్థులకు మోదం అని చెప్పవచ్చు. అదే సమయంలో వ్యూహాత్మక రాజకీయానికి తెలంగాణ ప్రజలు చిక్కితే.. తమకు ఇబ్బందులు తప్పవని కాంగ్రెస్ పార్టీతో పాటు గులాబీ పార్టీలో సైతం ఒక రకమైన ఆలోచన వచ్చింది. చూడాలి మరి ఏం జరుగుతుందో..



# ఇక బరువు తగ్గొద్దు లోకేశ్..

"ఇకపై బరువు తగ్గవద్దు లోకేశ్, ఇప్పటికే చాలా స్లిమ్‌గా ఉన్నావు" అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు సరదాగా సలహా ఇచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన తేనీటి విందులో ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. లోకేశ్ ఫిట్‌నెస్‌పై చర్చ వచ్చినప్పుడు, ఆయన ఇలా స్లిమ్‌గా, ఫిట్‌గా మారడానికి ప్రధాని మోదీనే కారణమని చంద్రబాబు తెలిపారు. తొలిసారి ప్రధానితో భేటీ అయిన తర్వాతే లోకేశ్ తన డైట్, ఫిట్‌నెస్‌పై పూర్తిస్థాయిలో శ్రద్ధ పెట్టారని మోదీకి వివరించారు. దీనికి స్పందించిన ప్రధాని, లోకేశ్‌ను అభినందిస్తూనే, ఇక బరువు తగ్గవద్దని సూచించారు.ఈ సంభాషణపై లోకేశ్ స్పందిస్తూ, ఫిట్‌నెస్ విషయంలో తనకు ప్రధాని మోదీయే స్ఫూర్తి అని అన్నారు. "దేశం కోసం క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నా, 75 ఏళ్ల వయస్సులో మీరు పాటించే ఆరోగ్య సూత్రాలు, శారీరక దృఢత్వం నాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి. మీ పని విధానం చూస్తుంటే 25 ఏళ్ల వయసున్న ముగ్గురు యువకులు మీలో ఉన్నట్లు చురుగ్గా పనిచేస్తారు. మీ స్ఫూర్తితో మరింత ఫిట్‌గా మారతాను" అని లోకేశ్ ప్రధానితో చెప్పారు. ఈ సమావేశం సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం, ప్రధాని అందిస్తున్న సాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

**సరదా సంభాషణలతో సాగిన భేటీ**

గంటకు పైగా సాగిన ఈ సమావేశం ఆద్యంతం సరదా సంభాషణలతో, నవ్వులతో సాగింది. చంద్రబాబు నివాసంలోకి అడుగుపెడుతూనే, సరిగ్గా ఏడాది క్రితం ఢిల్లీలో తన చేతుల మీదుగా ఆవిష్కరించిన 'యువగళం' కాఫీ టేబుల్ బుక్ ఫొటో ఫ్రేమ్‌ను చూసి ప్రధాని మోదీ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం చంద్రబాబు ఇంటిలోని రామ మందిరంలో ప్రధాని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడున్న పంచలోహ సీతారాముల విగ్రహాలను దివంగత ఎన్టీ రామారావు తమకు బహూకరించారని చంద్రబాబు ప్రధానికి వివరించారు. ఈ సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరూ తనకు గురువులు, మెంటార్లని అన్నారు.

## ఆ పెద్ద మనసుతో సహకరించండి
# మోదీకి రేవంత్ విజ్ఞప్తి

మోదీ చాలా పెద్ద మనసున్న వారని చెబుతుంటారు, ఆ పెద్ద మనసుతో తెలంగాణ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మోదీని రేవంత్ కోరారు. దేశ ప్రగతికి సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయబోమని, వికసిత్ భారత్ నిర్మాణంలో తెలంగాణను భాగస్వామిని చేస్తామని ఆయన ప్రధానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం కేవలం కేంద్ర ప్రభుత్వానిది కాదని, ఇది తెలంగాణ అభివృద్ధి ఉత్సవమని రేవంత్ రెడ్డి అన్నారు. "ప్రధాని మోదీ వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని ప్రకటించిన రోజే, దానికి అనుగుణంగా మేం 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. దేశాన్ని 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మీ కలను సాకారం చేయడంలో తెలంగాణ 10% వాటాను అందిస్తుంది. దేశ జనాభాలో 3% కంటే తక్కువ ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5% వాటాను తెలంగాణ అందిస్తోంది. రానున్న రోజుల్లో దీన్ని 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం" అని వివరించారు.ఈ లక్ష్య సాధన కోసం ఒక ఆసక్తికరమైన పోలికను ప్రధాని ముందుంచారు. "గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు, మీరు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆనాడు మీ 'గుజరాత్ మోడల్'కు ఆయన సహకరించారు. ఇప్పుడు మీరు ప్రధానిగా ఉండగా, నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. రాష్ట్ర ప్రజలు నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రానున్న పదేళ్లలో 'తెలంగాణ మోడల్' నిర్మించి, 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి మీ ఆశీస్సులు, సహకారం ఎంతో అవసరం" అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.దేశానికి ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ నగరాలు గ్రోత్ ఇంజన్ల వంటివని, ఈ నగరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ నగరాల నుంచి వచ్చే అభివృద్ధి ప్రతిపాదనలకు సత్వరమే అనుమతులు ఇచ్చేందుకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ లేదా సింగిల్ విండో వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.తెలంగాణకు అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, మూసీ నది సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్లు, హైదరాబాద్–మచిలీపట్నం పోర్టు మధ్య 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే లైన్ వంటి పెండింగ్ ప్రాజెక్టులను సీఎం రేవంత్ ప్రస్తావించారు. "ఈ ప్రాజెక్టులపై చర్చించేందుకు తెలంగాణ కోసం ఒక రెండు గంటల సమయం కేటాయించి ప్రత్యేక సమీక్ష నిర్వహించండి. మా ప్రతిపాదనలన్నింటినీ మీ ముందు ఉంచుతాం" అని కోరారు.




# ఇంటర్ అడ్మిషన్లు పాత పద్ధతిలోనే..



హైదరాబాద్: ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు 2026--27 విద్యా సంవత్సరానికి పాత పద్ధతిలోనే చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉందని, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి సీబీఎస్ఈలో తరహాలో 11, 12 తరగతులను పాఠశాల విద్యలోనే కొనసాగించాలని, ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అక్కడితోనే చదుకు ఆపేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ కూడా తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. జూనియర్ కాలేజీల యాజమాన్యాలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో సీఎం, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి వి.వి.శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణాలతో ఆదివారం సమీక్షించారు. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం తాజా ఆదేశాలతో అతి త్వరలో ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసే అవకాశం ఉంది.

# ఐపీఎస్ భార్య హత్య కేసు.. పనిమనిషి కల్పన కోసం పోలీసుల వేట

**విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం**

**పనిమనిషి కల్పనే ప్రధాన నిందితురాలని పోలీసుల నిర్ధారణ**

**నిందితుల కోసం నేపాల్ సరిహద్దులో గాలింపు**

**పక్కా పథకం ప్రకారమే దోపిడీ, హత్య జరిగిందని అనుమానం**



హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లో సంచలనం సృష్టించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ (60) హత్య కేసులో నిందితుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో ఊపిరాడకుండా చేసి ఆమెను హత్య చేసినట్లు పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో వెల్లడైంది. ఉన్నతాధికారులు నివసించే ప్రశాసన్‌నగర్‌లో ఇంతటి దారుణం జరగడంతో ఈ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.దర్యాప్తు కోసం పదికి పైగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సుమారు 200 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషించి కీలక ఆధారాలు సేకరించారు. ప్రధాన నిందితురాలు, ఇంట్లో పనిమనిషిగా చేరిన కల్పన తన సహచరులతో కలిసి ఆటోలో నాంపల్లికి వెళ్లి, అక్కడి నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పుర్ వైపు పారిపోయినట్లు గుర్తించారు. అయితే, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు మార్గమధ్యంలోనే రైలు దిగిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. కొన్ని టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం సాయంత్రానికే నేపాల్ సరిహద్దులకు చేరుకున్నట్లు సమాచారం.ఈ దోపిడీ, హత్య వెనుక పక్కా ప్రణాళిక ఉందని పోలీసులు నిర్ధారించారు. పనిలో చేరడం దగ్గర నుంచి దోపిడీ వరకు బయటి వ్యక్తుల ఆదేశాలతోనే కల్పన నడుచుకుందని భావిస్తున్నారు. ఆమెకు సన్నిహితంగా ఉన్న పలువురు నేపాలీ మహిళలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితులు ముగ్గురా, నలుగురా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోన్ల ఆధారంగా కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కుంకీ ఏనుగులకు ఆధార్‌లా ఓ గుర్తింపు కార్డు

ఏపీ ప్రభుత్వం గతేడాది కర్ణాటక నుంచి కుంకీ ఏనుగుల్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఏనుగులు ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో ఉన్నాయి. అయితే ఈ ఏనుగులకు రెండు రోజుల క్రితం డీఎన్ఏ టెస్టులు నిర్వహించారు. బ్లడ్ శాంపిల్స్ సేకరించి డెహ్రాడూన్ పంపారు. ఆ టెస్ట్ రిజల్ట్స్ వచ్చిన తర్వాత ఏనుగులకు ఆధార్ కార్డులా ఓ గుర్తింపు కార్డును తగిలించనున్నారుసాధారణంగా మనుషులకు ఆధార్ కార్డులు ఉంటాయి.. ఎక్కడైనా ఏనుగులకు ఆధార్ కార్డులు ఉండటం చూశారా. ఏపీలో మాత్రం ఏనుగులకు ఆధార్ కార్డులు రాబోతున్నాయి.. అది కూడా ఆరు గజరాజులకు మాత్రమే. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్ని గమనించి అటవీశాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో కుంకీ ఏనుగులు ఉన్నాయి.. వీటికి అధికారులు డీఎన్ఏ పరీక్షలు చేయించారు. ఈ ఏనుగుల నుంచి రెండు రోజుల క్రితం రక్త నమూనాలను సేకరించి డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్‌కు పంపారు.ఏనుగుల సంరక్షణ, పరిరక్షణ, శాస్త్రీయ అధ్యయనాల నిమిత్తం అధికారులు ఈ డీఎన్ఏ పరీక్షలు చేయించి ఆధార్ కార్డులా ఉండేట్టు ఓ గుర్తింపు కార్డును ఏనుగుకు తగిలించనున్నారు. డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ నుంచి టెస్టుల ఫలితాలు రాగానే ఆ వివరాలతో ఏనుగుకు ఒక గుర్తింపు కార్డును జారీ చేస్తారు. ఈ కుంకీ ఏనుగులకు ఇది ఆధార్ కార్డులా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఈ వివరాలతో రాబోయే రోజుల్లో ఏనుగులకు జన్యుపరమైన సమస్యలకు వైద్యంతో పాటు వాటి ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు అంటున్నారు. భవిష్యత్తు అవసరాలని గమనించి గజరాజులకు సంబంధించిన సమగ్ర వివరాల కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి అక్కడి నుంచి కుంకీ ఏనుగుల్ని రప్పించిన విషయం తెలిసిందే. అభిమన్యు, కృష్ణ, దేవ, జయంత్, రంజన్, వినయ్ అనే ఆరు కుంకీ గజరాజుల్ని తీసుకొచ్చి చిత్తూరు జిల్లా పలమనేరు క్యాంపులో ఉంచారు. ఈ కుంకీ ఏనుగుల దర్వారా అడవిలోని ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా మళ్లించడానికి శిక్షణ ఇచ్చారు. రెండుసార్లు ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా అటవీ ప్రాంతంవైపు మళ్లించే ప్రక్రియను విజయవంతం చేశారు.

# డెహ్రాడూన్‌లో ఘోర ప్రమాదం.. అనకాపల్లికి చెందిన ఆర్మీ జవాన్ దుర్మరణం

**విధి నిర్వహణలో ఆర్మీ నాయక్ రాపేటి పూర్ణచంద్రశేఖర్ కన్నుమూత**

**ప్రమాదంలో నాగాలాండ్‌కు చెందిన మరో సైనికుడు కూడా మరణం**

**నెలన్నర క్రితమే కుటుంబాన్ని డెహ్రాడూన్‌కు మార్చిన పూర్ణచంద్రశేఖర్**

**స్వగ్రామం వెంకుపాలెంలో విషాదంలో మునిగిన కుటుంబ సభ్యులు**




విధి నిర్వహణలో జరిగిన ఘోర ప్రమాదంలో భారత సైన్యానికి చెందిన ఓ తెలుగు జవాన్ ప్రాణాలు కోల్పోయారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన రాపేటి పూర్ణచంద్రశేఖర్ (37) శుక్రవారం రాత్రి డెహ్రాడూన్‌లో మరణించారు. ఆయన ఆర్మీలో నాయక్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటన ఆయన స్వగ్రామంలో, కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, శుక్రవారం రాత్రి పూర్ణచంద్రశేఖర్ ట్రక్కులో విధులకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక చోట ఆర్చి ఒక్కసారిగా కూలిపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో నాగాలాండ్‌కు చెందిన మరో సైనికుడు కూడా మరణించినట్లు సమాచారం. అయితే, ప్రమాదం జరిగిన తీరుపై సైన్యం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.పూర్ణచంద్రశేఖర్‌కు భార్య గ్రేసి, ఐదేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కేవలం నెలన్నర క్రితమే ఆయన తన కుటుంబాన్ని డెహ్రాడూన్‌కు తీసుకెళ్లారు. ఇంతలోనే ఈ విషాదం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి భీమరశెట్టి రామకృష్ణ వెంకటపాలెంలోని ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ డెహ్రాడూన్ లోని ఆర్మీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. జవాన్ భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వార్త తెలియగానే వెంకుపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలి

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని క్రైస్తవులకు శ్మశాన వాటికలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎన్నో ఏళ్ళుగా శ్మశాన వాటికలకు స్థలం కేటాయింపు పెండింగ్లో ఉందని సీఎం రేవంత్రెడ్డి పట్టించుకోవాలని ఖైరతాబాద్ పాస్టర్స్ ఫెల్లోషిప్ అధ్యక్షుడు డాక్టర్ బి. పీటర్ అన్నారు. శనివారం ఫిలింనగర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో చర్చిల నిర్మాణానికి, పునరుద్దరణకు నిధులు వస్తున్నాయని, క్రైస్తవ మహిళలకు కుట్టుమిషన్లు కూడా ఇచ్చారని, ప్రతియేటా ఓవర్సీస్ స్టడీస్ కోసం 100 మంది విద్యార్థులకు ' 20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారని ఇది ఎంతో సంతోషించే విషయమని అదే విధంగా క్రైస్తవులు చనిపోయినప్పుడు ఎన్నో బాధలు పడుతున్నారని ఈ విషయాన్ని తాము ఎన్నోసార్లు గత ప్రభుత్వాలకు చెప్పినా పట్టించుకోలేదని రేవంత్రెడ్డి క్రైస్తవుల బాధను అర్థం చేసుకొని క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించాలని కోరారు.

# ఆ మూడుఫైళ్లపై విజయ్ సంతకం!

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత విద్యుత్, ఇంకొకటి మహిళల రక్షణ కోసం సింగ పెన్ ప్రత్యేక దళం, మరొకటి రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన చర్యలకు సంబంధించిన ఫైల్. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ మూడు ఫైళ్లపై సంతకం చేశారు విజయ్.

- తమిళనాడులో ప్రస్తుతం గృహ అవసరాలకు మొదటి 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. అయితే తాను అధికారంలోకి వస్తే ఆ పరిమితిని 200 యూనిట్లకు పెంచుతానని విజయ్ హామీ ఇచ్చారు. అందుకే తన తొలి సంతకంగా ఆ ఫైల్ పై సంతకం చేశారు. తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రధాన హామీని మొదటి రోజే అమలు చేశారు. రెండు నెలలకు 500 యూనిట్ల వరకు విద్యుత్తును వినియోగించే గృహ వినియోగదారులకు.. రెండు నెలలకు కలిపి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభిస్తుంది.
- ఇక రెండో హామీగా మహిళల భద్రతకు సంబంధించిన ప్రత్యేక రక్షణ దళం ఫైల్ పై కూడా సంతకం చేశారు. సింగపెన్ ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేస్తూ అక్కడికక్కడే ఉత్తర్వులు జారీ చేశారు.
- ఇక రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు విజయ్. ఆ హామీకి సంబంధించిన ఫైల్ పై మూడో సంతకం చేశారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తమిళనాడు ను తీర్చిదిద్దడమే లక్ష్యం అని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ క్లబ్బుల ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు విజయ్. అందుకే ఇప్పుడు మాదకద్రవ్యాల నిరోధక విభాగాలను ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగానికి ఆదేశించారు.
- అయితే భారీ ఖర్చుతో కూడుకున్న హామీలను తన నెత్తిపై వేసుకునే ప్రయత్నం చేయలేదు. ఆర్థిక పరిస్థితిని అధ్యయనం చేస్తానని.. త్వరలో శ్వేత పత్రం విడుదల చేస్తానని.. రాష్ట్రం 10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని.. ఖజానా ఖాళీగా ఉందని చెప్పుకొచ్చారు విజయ్. తద్వారా ఆర్థిక భారంతో కూడిన పథకాలు తరువాతనేనని సంకేతాలు పంపించారు.


# రేపట్నుంచి పెరగనున్న ఉష్ణోగ్రతలు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో వారం రోజులుగా సాధారణం, అంతకంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. మంగళవారం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయి. ఆదివారం రాష్ట్రంలో చాలాచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదు కాగా.. మంగళవారం నుంచి క్రమంగా పెరిగి సాధారణం కంటే 2 నుంచి 4డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ సూచించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలులు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని వివరించింది. ఈ వారాంతం వరకు ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయని తెలిపింది. ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్‌లో 41.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 22.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. సోమవారం ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది.

# అమెరికా ప్రతిపాదనలపై చర్చకు ఓకే

సహా అన్ని యుద్ధాలను నిలిపివేయాలని, నౌకాయానం భద్రతకు భరోసా ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ముందుగా వీటిపైనే చర్చలు జరగాలని స్పష్టం చేసింది. ఇవి కార్యరూపం దాల్చాకే హార్మూజ్‌ను తిరిగి తెరవడం, అణుకార్యక్రమాన్ని వదులుకోవడంపై వంటి వాటిపై చర్చలు జరపాలని ప్రభుత్వం పేర్కొందని ఇరాన్ టీవీ తెలిపింది. ఈ షరతులపై అమెరికా స్పందించాల్సి ఉంది. మరోవైపు ఇరాన్--అమెరికాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఆటంకాలు కొనసాగుతున్నాయి. తాజాగా గుర్తు తెలియని ప్రాంతం నుంచి దూసుకొచ్చిన డ్రోన్ల దాడులతో ఖతార్ తీరంలోని ఓ సరుకు నౌకకు నిప్పంటుకోగా, కొన్ని డ్రోన్లు కువైట్ గగనతలంలోకి చొరబడ్డాయి. ఆదివారం ఉదయం అబుధాబి నుంచి వస్తున్న వాణిజ్య నౌకపై జరిగిన డ్రోన్ దాడి ఫలితంగా చెలరేగిన మంటలను వెంటనే ఆర్పేశామని ఖతార్ తెలిపింది. ఆదివారం వేకువజామున తమ గగనతలంలోకి ప్రవేశించిన గుర్తు తెలియని డ్రోన్లను మధ్యలోనే పేల్చివేసినట్లు కువైట్ వెల్లడించింది. దాడులపై ఖతార్ తీవ్రంగా స్పందించింది. ఇలాంటి అత్యంత ప్రమాదకరమైన ఏమాత్రం ఆమోదయోగ్యం కాని ఉద్రిక్తత అంటూ వ్యాఖ్యానించింది. తాము గుర్తు తెలియని డ్రోన్లను కూల్చివేసినట్లు యూఏఈ రక్షణ శాఖ తెలిపింది. ఇవి ఇరాన్ ప్రయోగించినవేనంటూ ఆరోపించింది. గత వారం హార్మూజ్ జలసంధిలో లంగరు వేసి ఉన్న తమ నౌకపై వెంటవెంటనే రెండు డ్రోన్‌దాడులు జరిగినట్లు దక్షిణ కొరియా నౌక ఆదివారం తెలిపింది. దాడితో పేలుడు, మంటలు చెలరేగాయని వెల్లడించింది.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్




ఎడిటోరియల్



## పంచాయితీ ఎన్నికలకు అంతా సిద్ధం

స్థానిక సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఇదే విషయాన్ని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలతోపాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, నగరపాలక సంస్థలకు సంబంధించిన పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఆరు నెలల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలన్నది ఒక నిబంధన. ఇప్పుడు సీఎం చంద్రబాబు తాజా ప్రకటనతో ప్రభుత్వం వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తున్నట్లు అర్థం అవుతోంది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు వస్తేనే ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం వాటి ఎన్నికల నిర్వహణపై ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్లు అర్థమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వాటికి సంబంధించి సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2 తో ముగిసింది. దీంతో సర్పంచులు మాజీలు అయ్యారు. వారి స్థానంలో పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది ప్రభుత్వం. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్ పడే అవకాశం ఉంది. ఇప్పటికే 16వ ఆర్థిక సంఘం సమయం ప్రారంభం అయింది. దాదాపు 15 వేల కోట్ల రూపాయల వరకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఈ నిధులు మంజూరయ్యేవి. అందుకే వీలైనంత త్వరగా పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసి 16వ ఆర్థిక సంఘం నిధులతో.. పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 12 కార్పొరేషన్ల తో పాటు 123 మున్సిపాలిటీలు/ నగర పంచాయతీలు ఉన్నాయి. వీటికి సంబంధించి పదవీకాలం మార్చి 17 తో ముగిసింది. ప్రస్తుతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా ఉన్నారు. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో పట్టణాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అందుకే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. వార్డుల విభజనకు సంబంధించిన ప్రక్రియ కూడా జరుగుతోంది. ఇక మండల పరిషత్ తో పాటు జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించిన గడువు జూన్ వరకు ఉంది. మండల పరిషత్ అధ్యక్షులతోపాటు జిల్లా పరిషత్ అధ్యక్షుల పదవీకాలం జూన్ తో ముగియనుంది. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పరిషత్ కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత జిల్లా పరిషత్ లది. అందుకే వీటి ఎన్నిక సైతం వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అనేక రకాల పిటిషన్లు కోర్టుల్లో దాఖలు అయ్యాయి. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్నాయి. అయితే బీసీ గణన తర్వాత రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందని ప్రభుత్వం చెప్పింది. అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మాత్రం వేసవి తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఛాన్స్ కనిపిస్తోంది.

మహాభారతం కేవలం ఒక పురాతన కావ్యం మాత్రమే కాదు అది మానవ స్వభావానికి అద్దం పట్టే శాశ్వత జీవన దర్పణం. వేల ఏళ్ళ క్రితం కురుక్షేత్ర రణభూమిలో వినిపించిన శంఖారావం నేటికీ మన సమాజంలోని వీధుల్లో, కార్యాలయాల్లో, రాజకీయ వేదికలపై ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందులోని పాత్రలు కాలచక్రం తిరిగినా తమ రూపాలు మార్చుకుంటూ మన మధ్యనే నడయాడుతూ ఉంటాయి.



## ఈ దుర్యోధన... దుశ్శాసన లోకం...!

హస్తినాపురం అంతఃపురంలో పుట్టిన దుర్యోధనుడు, దుశ్శాసనుడు ఈ రోజు కూడా అదే గర్వంతో, అదే దురహంకారంతో, అదే అన్యాయ బుద్ధితో మన గ్రామాల్లో, మన నగరాల్లో, మన పాలన మందిరాల్లో తిరుగాడుతున్నారు. పేర్లు మారాయి, వస్త్రాలు మారాయి, యుగం మారింది కానీ అధర్మం యొక్క మూల స్వభావం మాత్రం ఇసుమంతైనా మారలేదు.అధికారం చేతికి వచ్చినప్పుడు మనిషి తన అసలు స్వభావాన్ని బయటపెడతాడు దుర్యోధనుని కళ్ళు అదే చెప్పాయి, ఈ కాలపు అధికారుల కళ్ళూ అదే చెప్తున్నాయి.దుర్యోధనుని గురించి ఆలోచించినపుడు మనకు కనిపించేది కేవలం ఒక రాజకుమారుని దురాశ మాత్రమే కాదు. అది ఒక వ్యవస్థాగత అహంకారం. పుట్టుకతో వచ్చిన అధికారం తనదే అనే భ్రమ. పాండవులకు వారి న్యాయమైన హక్కు ఇవ్వటానికి నిరాకరించిన దుర్యోధనుడు "సూచీ అగ్రమాత్రమైనా ఇవ్వను" అన్న మాటలు ఇవి ఒక్క పురాతన పాత్రకు పరిమితమైనవి కావు. ఈ రోజు పేద రైతుకు అర్హమైన పరిహారం ఇవ్వడానికి నిరాకరించే అధికారి నోటి మాటలు అవే. అటవీ బిడ్డలైన ఆదివాసీలకు వారి భూమి మీద హక్కును గుర్తించని నేతల వర్తనమూ అదే. నాది కానిది కూడా నాకే కావాలి అనే ఈ అత్యాశే నేడు అవినీతికి, అరాచకానికి పునాది వేస్తోంది.దుశ్శాసనుడేమో మరో రకమైన రాక్షసత్వాన్ని ప్రతినిధిత్వం చేస్తాడు. అతనికి సొంత ఆలోచన లేదు. అన్న మాటపై, అన్న చెప్పిన పని చేయడమే జీవితసత్యంగా భావించే అంధ అనుసరణ అతనిది. ద్రౌపదిని నిండుసభలో అవమానపరిచినప్పుడు ఆ సభలో వందలమంది మహాత్ములు నిశ్శబ్దంగా కూర్చున్నారు. భీష్మ పితామహుడు నీతి శాస్త్రాలు తెలిసినవాడై ఉండి కూడా మాట్లాడలేదు. ద్రోణుడు తన విద్యను అధికారం వద్ద తాకట్టు పెట్టి తల దించుకున్నాడు. విదురుడు వ్యతిరేకించాడు కానీ ఆపలేకపోయాడు. ఆ నిశ్శబ్దమే అసలైన పాపం. ఈ రోజూ అదే జరుగుతోంది. ఏ సమావేశంలోనైనా, ఏ కార్యాలయంలోనైనా, ఏ వీధిలోనైనా అన్యాయం జరిగినప్పుడు నిశ్శబ్దంగా కూర్చునే వారే దుశ్శాసనుని బాధితులను మళ్ళీ మళ్ళీ సృష్టిస్తున్నారు.మన రాజకీయ వ్యవస్థలోకి ఓ నిశిత దృష్టి వేస్తే ఈ పాత్రలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. ఎన్నికల వేళ ప్రజలకు వందలు, వేలు పంచి, అధికారంలోకి వచ్చాక ఆ ప్రజలనే తన బానిసలుగా చూసే నేత ఇతడు దుర్యోధనుడు కాక మరెవరు? జూదంలో రాజ్యాన్ని గెలుచుకున్నట్లే ఓట్ల మోసంతో, కుట్రలతో సింహాసనం అందుకున్న నేత, నైతికతను పణంగా పెట్టి అధికారాన్ని నిలుపుకుంటాడు. అతని చుట్టూ ఉన్న అనుచర గణం పదవి కోసం, పైసల కోసం అన్నీ మరచి అతని తప్పులను సమర్థించేవారు వీరే నేటి దుశ్శాసనులు. వీరికి చట్టం పట్ల భయం లేదు, ధర్మం పట్ల గౌరవం లేదు. వారికి కావాల్సింది కేవలం యజమాని మెప్పు మాత్రమే.

పత్రికారంగంలోనూ ఈ ద్వయం కనిపిస్తుంది. సత్యాన్ని అణచివేసే, స్వలాభం కోసం వార్తలను వంచే యజమాని దుర్యోధనుడైతే, ఆ నిర్దేశాలు పాటిస్తూ అబద్ధాలను అందంగా అలంకరించే సంపాదకుడు

> సామాన్యుల హక్కుల కోసం అడవుల్లో, పల్లెల్లో పోరాడే మానవహక్కుల కార్యకర్తలు మన మధ్య ఉన్న పాండవులే. నిజాన్ని రాయడానికి ప్రాణాలు పణంగా పెట్టిన జర్నలిస్టులు, సుఖవంతమైన జీవితాలను వదిలి గ్రామీణ సేవలో జీవితం అర్పించిన యువతీయువకులు వీరంతా ధర్మపక్షాన నిలిచిన యోధులు.ఈ పాండవులు ఇప్పుడు అడవుల్లో లేరు. వారు మన మధ్యనే, మన వీధుల్లోనే ఉన్నారు.

దుశ్శాసనుడు. అలాగే విద్యారంగంలో సామాన్యుల బిడ్డలకు రావలసిన అవకాశాలను తొక్కేసి, కేవలం తమ వారికే పీఠాలు కట్టబెట్టే వ్యవస్థ దుర్యోధన మనస్తత్వానికి నిలువుటద్దం.న్యాయవ్యవస్థలో అధికార పలుకుబడికి, ధనబలానికి లొంగిపోయే తీర్పులు ద్రౌపది వస్త్రాపహరణంకంటే తక్కువ దారుణమేమీ కాదు. ఎందుకంటే ఆనాడు కురుసభలో జరిగిన అవమానం ఒక్కరికి మాత్రమే జరిగింది కానీ ఈ రోజు అన్యాయమైన తీర్పుల వల్ల, ఆలస్యమవుతున్న న్యాయం వల్ల లక్షలమంది జీవితాలు ధ్వంసమవుతున్నాయి. న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టడం అంటే కేవలం నిష్పాక్షికత మాత్రమే కాదు, నేడు అన్యాయాన్ని చూసి చూడనట్లు నటించడం కూడా అయిపోయింది.అయితే మహాభారతం కేవలం నిరాశావాదాన్ని లేదా అంధకారాన్ని బోధించలేదు. ధర్మం తప్పకుండా నెగ్గుతుందని, అధర్మం ఎంత బలంగా ఉన్నా ఒకనాడు మట్టిలో కలిసిపోతుందని శ్రీకృష్ణుడు స్వయంగా నిరూపించాడు. దుర్యోధనుని పదహారేళ్ళ ఆధిపత్యం ఒక్క రోజులో కుప్పకూలిపోయింది. దుశ్శాసనుని చేయి భీముని పరాక్రమం ముందు నిస్సహాయంగా పడిపోయింది. ఆ సత్యం ఇప్పటికీ అక్షరసత్యం.చరిత్రను పరిశీలిస్తే ప్రపంచంలో ఎంతటి నియంతలైనా, ఎంతటి అన్యాయ పాలకులైనా చివరికి ప్రజాశక్తి ముందు మోకరిల్లవలసివచ్చింది. అజేయం అనుకున్న రోమన్ సామ్రాజ్యం పడిపోయింది, సూర్యుడు అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం వెనక్కి నడిచింది. కురుక్షేత్రం ప్రతీ తరంలోనూ జరుగుతూనే ఉంది కానీ చరిత్ర సాక్షిగా ధర్మపక్షం ఎప్పుడూ పూర్తిగా ఓడిపోలేదు. కాలం ఎప్పుడూ అన్యాయాన్ని భరించదు, అది ఒక పరిమితి దాటినప్పుడు విలయ తాండవం చేస్తుంది.అసలు ప్రశ్న ఏమిటంటే ఈ కాలపు పాండవులు ఎవరు?ధర్మం కోసం నిలబడే ధైర్యస్థులు ఎవరు? అడవులకు పంపబడ్డా, అవమానాలు భరించినా, ఏళ్ళ తరబడి పోరాటం చేసినా ధర్మమార్గాన్ని వదలని వారు ఎక్కడ ఉన్నారు? మన సమాజంలో వారు లేరా? ఖచ్చితంగా ఉన్నారు! అవినీతిని ఎదిరించి, పదవులను తృణప్రాయంగా వదిలేసి జైలుకు వెళ్ళిన విజిల్‌బ్లోయర్లు నేటి భీమార్జునులు. సామాన్యుల హక్కుల కోసం అడవుల్లో, పల్లెల్లో పోరాడే మానవహక్కుల కార్యకర్తలు మన మధ్య ఉన్న పాండవులే. నిజాన్ని రాయడానికి ప్రాణాలు పణంగా పెట్టిన జర్నలిస్టులు, సుఖవంతమైన జీవితాలను వదిలి గ్రామీణ సేవలో జీవితం అర్పించిన యువతీయువకులు వీరంతా ధర్మపక్షాన నిలిచిన యోధులు.ఈ పాండవులు ఇప్పుడు అడవుల్లో లేరు. వారు మన మధ్యనే, మన వీధుల్లోనే ఉన్నారు. వారికి కావలసింది మన మొక్కుబడి మద్దతు కాదు. వారికి మన గొంతు కావాలి, మన నిద్రలేని ప్రశ్నలు కావాలి. వారి పోరాటంలో మనం భాగస్వాములం కానప్పుడు, మనం కూడా పరోక్షంగా దుశ్శాసనులమే అవుతాం.

మరొక లోతైన కోణంలో చూస్తే ప్రతి మనిషిలోనూ ఒక దుర్యోధనుడు దాగి ఉంటాడు. నాకు మాత్రమే ఇది రావాలి, నాకే ముందు దక్కాలి, నా మాటే చెల్లాలి అనే స్వార్థపు ఆలోచన ప్రతి మనిషిలోనూ ఎక్కడో ఒకచోట మొలకెత్తుతూనే ఉంటుంది. అది చిన్నచిన్న విషయాల్లో మొదలై పెద్ద అధర్మాలకు దారి వేస్తుంది. రోడ్డుపై ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం నుండి, ఆఫీసులో ఒక సహోద్యోగి ఎదుగుదలను అక్రమంగా అడ్డుకోవడం వరకు ఇవన్నీ మన లోపలి దుర్యోధన ప్రవృత్తికి నిదర్శనాలు.కుల వివక్షతో ఒక మనిషిని తక్కువ చేసి చూడటం, స్త్రీని ఒక వస్తువులా భావించి అగౌరవపరచడం ఇవన్నీ మన లోపలి దుశ్శాసనుని చర్యలే. కాబట్టి మహాభారతం మనల్ని అడిగే మొట్టమొదటి ప్రశ్న ఇది కాదు బయట ఉన్న దుర్యోధనుడు ఎవరు? అని. అది సంధించే మొదటి ప్రశ్న.నీ లోపలి దుర్యోధనుడికి నీవు ఏమి జవాబు చెబుతున్నావు?అహంకారాన్ని గుర్తించడం, స్వార్థాన్ని జయించడం, అన్యాయాన్ని చూసి ఎదురుతిరగడం ఇవే నేటి కాలపు కురుక్షేత్ర యుద్ధం. శ్రీకృష్ణుడు అర్జునుడికి గీత బోధించేటప్పుడు ఒక గొప్ప సత్యాన్ని స్పష్టంగా చెప్పాడు

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" నీ విధిని నీవు నిర్వర్తించు ఫలాపేక్ష లేకుండా, భయం లేకుండా. ఆ వాక్యం కాలాతీతమైనది. ఈ రోజు మనం చేయవలసింది అదే ఫలితం ఏమైనా సరే, ధర్మం పక్షాన నిలబడటం. ఎదురుగా ఉన్నది బంధువులా, స్నేహితులా అని చూడకుండా, ఏది సత్యమో దాని వైపు అడుగు వేయడం. నిశ్శబ్దంగా ఉండి భీష్ముడిలా విలపించడం కంటే, గొంతు విప్పి విదురుడిలా హెచ్చరించడం మిన్న."ఈ దుర్యోధన దుశ్శాసన లోకం..." అని కేవలం పాటలు పాడుకుంటూ ఆవేదన పడటం చాలా సులభం. కానీ అసలైన పని ఆ ఆవేదనను చైతన్యంగా మార్చడం. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడూ ఒక అర్జునుడే. మన చేతిలో ఉన్న ప్రతి ఓటు ఒక గాండీవం. మనం సంధించే ప్రతి ప్రశ్న ఒక అస్త్రం. ఆ ఆయుధాలను సరైన సమయంలో ఉపయోగించని పక్షంలో, మనం అన్యాయానికి సహకరించిన వారమవుతాం. మన మౌనమే దుర్యోధనుల బలాన్ని పెంచుతోంది.కురుక్షేత్ర యుద్ధం కొన్ని వేల ఏళ్ళ క్రితం ముగిసిపోలేదు. అది నేటికీ కొనసాగుతోంది ప్రతి అసెంబ్లీలో, ప్రతి పంచాయతీలో, ప్రతి ఇంటి గడపలో, చివరికి ప్రతి మనిషి మనసులో. ఆ రణభూమిలో మీరు ఏ పక్షాన నిలుచుంటారు? దుర్యోధనుని అధికారం చూసి భయపడి మూగగా ఉంటారా, లేదా ధర్మపక్షాన నిలబడి పోరాడతారా? ఈ ప్రశ్నకు సమాధానం మీ చేతుల్లోనే ఉంది.చివరగా మహాభారతం మనకు ఒక్క హెచ్చరిక చేసింది.అధర్మం ఎంత ఉన్నతంగా కనిపించినా, ఎంతటి కోటలను నిర్మించుకున్నా దాని పునాది ఇసుకపై నిర్మించిన భవనం వంటిదే. ఒక్క సత్య వాక్కు చాలు, ఆ భవనాన్ని కూల్చడానికి.ఆ సత్యవాక్కు మీ నోట నుండి రావాలి. ఆ నిరసన మీ కలం నుండి జాలువారాలి. అన్యాయం జరిగినప్పుడు నాకెందుకులే అని తల వంచుకోకుండా, ఇది తప్పు అని వేలెత్తి చూపడమే మనం ఈ కాలపు ధర్మానికి చేసే గొప్ప సేవ. చరిత్ర ఎప్పుడూ మౌనంగా ఉన్న వారిని గుర్తుపెట్టుకోదు. కేవలం ధైర్యంగా నిలబడి, అన్యాయాన్ని ఎదిరించిన వారిని మాత్రమే చిరస్థాయిగా స్మరిస్తుంది. నేటి కురుక్షేత్రంలో మీ పాత్రను నిర్ణయించుకోండి. యుద్ధం ఇప్పటికే మొదలైంది!



డా .సూర్యదేవర
రామకృష్ణ ,
9490754169

## నిప్పులు చెరుగుతున్న సూరీడు



తెలంగాణలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. ఇన్నాళ్లు ఒక మోస్తరుగా ఉన్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడగ విప్పాయి. ఎండల తీవ్రత భారీగా పెరగనుందని, ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ మార్కును దాటుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేస్తూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత అత్యధికంగా ఉండనుంది. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భానుడి భగభగలు మొదలయ్యాయి. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అదనంగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. మే నెల ద్వితీయార్థంలో ఉండాల్సిన వేడి ఇప్పుడే కనిపిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఈ నెల 12వ తేదీ నాటికి ఎండలు పతాక స్థాయికి చేరుతాయని అంచనా. ఉమ్మడి నల్గొండ మరియు ఖమ్మం జిల్లాలు మినహా రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకు వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలెర్ట్ ఇచ్చింది. దీని అర్థం కేవలం ఎండ మాత్రమే కాదు, తీవ్రమైన వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరిక. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావడం ప్రాణసంకటంగా మారే అవకాశం ఉంది. వైద్యుల సూచనలు -- తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆరోగ్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు: నీరు ఎక్కువగా తాగాలి: దాహం వేయకపోయినా తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి. ద్రవ పదార్థాలు ముఖ్యంగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండవచ్చు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం శ్రేయస్కరం. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ తప్పనిసరిగా వాడాలి. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ఎండ వేడికి త్వరగా ప్రభావితం అవుతారు కాబట్టి, వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. రాబోయే మూడు నాలుగు రోజుల పాటు వాతావరణం ఇలాగే నిప్పుల కొలిమిలా మారనుంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి కూడా మొదలవ్వడంతో, ఎండల తీవ్రత సామాన్య ప్రజల జీవనగతిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధికారుల సూచనలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండటమే ప్రస్తుతానికి అత్యుత్తమ మార్గం.

## సైబర్ నేరాల్లో హైదరాబాద్ టాప్

దేశంలోని ప్రధాన నగరాలతో పోటీపడుతూ హైదరాబాద్‌లో నేరాల రేటు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (చీజ=దీ) విడుదల చేసిన 2024 నివేదిక ప్రకారం, నగరంలో ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలు , చిన్నారులపై జరుగుతున్న అరాచకాలు పెరిగాయి.తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం, ఆన్‌లైన్ గేమింగ్, , వ్యసనాల కారణంగా చిన్నారులు నేరాల బాట పడుతున్నారు. ముఖ్యంగా 12-14 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలు చిన్న చిన్న దొంగతనాల నుండి హత్యలు, అరాచకాల వరకు పాల్పడుతుండటం గమనార్హం. 2023లో చట్టంతో విభేదించిన బాలల కేసులు 180 నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 316కు చేరింది.ఆర్థిక నేరాల విషయంలో ముంబై తర్వాత హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయనే ఆశతో సామాన్యులు సైబర్ మాయగాళ్ల చేతిలో చిక్కి కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. సైబర్ నేరాల్లో నగరం దేశంలోనే మూడో స్థానంలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.నగరంలోని బహిరంగ ప్రదేశాలు, రద్దీ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులపై వేధింపులు అధికమవుతున్నాయి. 2024లో నగరంలో 149 లైంగిక వేధింపుల కేసులు, 358 అత్యాచార కేసులు నమోదయ్యాయి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తల వ్యాప్తిలో కూడా హైదరాబాద్ దేశంలోనే తొలి స్థానంలో నిలవడం గమనార్హం.నేరాలు భారీగా నమోదవుతున్నప్పటికీ, వాటిపై ఛార్జిషీట్లు దాఖలు చేయడంలో మాత్రం జాప్యం జరుగుతోందని నివేదిక పేర్కొంది. 2024లో నమోదైన మొత్తం నేరాల్లో కేవలం 56.9 శాతం కేసుల్లోనే ఛార్జిషీట్లు దాఖలయ్యాయి. పెరుగుతున్న ఈ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

## సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగరావు పిలుపు

**గండిపేట(క్రైం మిర్రర్):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాజేంద్రనగర్ మండల సమితి మండల కార్యాలయం ఏ ఆర్ దేవరాజ్ భవన్ లో మండలంలోని 18 శాఖల కార్యదర్శుల, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాలు నర్సింగ్ రావు హాజరయ్యారు. పుస్తకాల నర్సింగ్ రావు, కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 18 శాఖల కార్యదర్శులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అందరూ రాష్ట్ర పార్టీ జిల్లా పార్టీ ఇచ్చినటువంటి పార్టీ కార్యక్రమాలతో పాటు లోకల్ సమస్యల పైన నిరంతరం పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పార్టీ శాఖ సమావేశాలు మూడు నెలలకు ఒకసారి జరగాలని, మండలంలోని అన్ని ప్రజా సంఘాల నిర్మాణం జరగాలని వారు అన్నారు. త్వరలో అఖిల భారత యువజన సమైక్య, అఖిల భారతన విద్యార్థి సమైక్య మండల మహాసభలు చేయాలని వారు అన్నారు. మండలంలోని అర్హులైనటువంటి నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.




శాఖ కార్యదర్శులు జి. సత్యం, జే. సదానంద గౌడ్, సయ్యద్ కాజా, పాండు, సాబేరు, హుస్సేన్ భాయ్, పుష్ప, శాంతమ్మ, సరూప, వాణి, కృష్ణ, కాజా, ప్రతాప్ రెడ్డి, నవీన్ కుమార్, చారి తదితరులు పాల్గొన్నారు.



# కిస్మత్‌పూర్ నుంచి మోడీ సభకు తరలిన బీజేపీ నాయకులు

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ 122 డివిజన్ నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ భారీ బహిరంగ సభకు బీజేపీ నాయకులు భారీ ఎత్తున బయలుదేరి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర నాయకులు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్‌ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో నాలుగు బస్సుల్లో మహిళలతో పాటు భారీగా ర్యాలీతో బహిరంగ సభకు బయలుదేరారు. అంతకుముందు కిస్మత్‌పూర్ వీధుల్లో తిరుగుతూ బీజేపీ నినాదాలతో మారుమోగించి మోడీ సభకు బయలుదేరారు. దాదాపు 400పైబడి జనాలతో సభకు బయలుదేరారు. స్వచ్ఛందంగా సభకు జనాలు రావడం ఆనందాకమని మునుముందు రాబోయే రోజుల్లో బీజేపీ పాలనను తెస్తామని అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి లక్ష్యంగా నరేంద్రమోడీ చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల స్వచ్ఛందంగా గమనిస్తున్నారని రాబోయే కాలంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీరుడు పవన్‌సాయి, అన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, ఎస్.సాయి, శేఖర్, లక్ష్మణ్‌ముదిరాజ్ తదితరులున్నారు.

# రాజేంద్రనగర్ నుంచి మోడీ సభకు తరలిన బీజేపీ నాయకులు

**గండిపేట(క్రైం మిర్రర్):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ భారీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. భారీగా బస్సుల ర్యాలీలను ప్రారంభించి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ, గోషామహల్ ఇన్‌చార్జ్ శ్రీధర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు జి.బాబురావు, డివిజన్ ఉపాధ్యక్షులు పవన్‌రాజ్, డివిజన్ కార్యాదర్శి కవిత, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి గుడిసెయాదయ్య, జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు పి.రవీందర్, ప్రధాన కార్యదర్శి ఈ.వేణుగోపాల్, నాయకులు జ్ఞానేశ్వర్, కిరణ్, రమణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.






# కోదాడ బాప్టిస్ట్ చర్చిలో ఘనంగా మదర్స్ డే వేడుకలు : పాస్టర్ యేసయ్య

**కోదాడ మే 10 క్రైమ్ మిర్రర్ :** కోదాడ : మానవ చరిత్రలో తల్లి పాత్ర ఎంతో గొప్పదని ఆమె కుటుంబాని దేశాన్ని ఏలే శక్తి మంతురాలని ఆమె జీవితం పిల్లల ప్రాయోజకుల గాతీర్చి దిద్దాటములో ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు తల్లి తండ్రులను గౌరవిస్తే దీర్ఘాయువు ఉంటుంది అని, ముదిమిలో తల్లిని జాగ్రత్తగా చూసుకోవాలని వారిని అగౌరా పరిచకూడదని అన్నారు తల్లి ప్రేమకన్నా గొప్ప ప్రేమ ఎవరినుండి దొరకదని కొనియాడరు ఈ కార్యక్రమం లో సంఘ విశ్వాసులు పెద్దలు యవ్వనస్థులు సంఘ పాటల బృందం పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియ చేసుకున్నారు.



సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకి జిహెచ్ఎంసి 58వ డివిజన్ మీర్పేట్ ప్రశాంతి హిల్స్ డివిజన్ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో 600 మంది జనంతో భారీగా తరలి వెళ్లడం జరిగింది

(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)

# సెంట్రింగ్, షట్టరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్

**గండిపేట(క్రైం మిర్రర్):** సెంట్రింగ్, షట్టరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్‌లు డిమాండ్ చేశారు. గండిపేట మండల పరిధిలో పని చేస్తున్న సుమారు 15 వేల మంది సెంట్రింగ్, షట్టరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు కె.కృష్ణా, ఎన్.అశోక్, బట్ట శ్రీనివాస్, ఎస్.రాములు తదితరులు గోరుకంటి విఠల్ ఆధ్వర్యంలో నాయకులను కలిసి తాము తలపెట్టిన బంద్‌కుమద్దతు కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఎండిఏ పరిధి నిర్మాణ పనుల్లో కనీసం 70 శాతం స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. నిర్మాణ కార్మిక సంక్షేమ నిధులను వెంటనే కార్మికుల సంక్షేమానికి వినియోగించాలన్నారు. ప్రమాద మరణ పరిహారాన్ని ప్రస్తుతం ఉన్న 6--8 లక్షల నుంచి 20 లక్షలకు పెంచాలన్నారు. వృద్ధ నిర్మాణ కార్మికులకు 3 వేలు నెల సరి ఫెన్షన్ కల్పించాలన్నారు. అర్హులైన కార్మికులకు ఈఎస్ఐ, ఆరోగ్య కార్డులు, ప్రమాద భీమా అమలు చేయాలన్నారు. సెంట్రింగ్, షట్టరింగ్ పనులకు చదరపు అడుగుకు 51 రేటును ప్రమాణీకరించాలన్నారు. కనీస వేతనాలు, విడిఏలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు.




# శివరాంపల్లిలో ఈ నెల 16న హిందూ సమ్మేళన కార్యక్రమం




గండిపేట(క్రైం మిర్రర్): రాజేంద్రనగర్ డివిజన్ శివరాంపల్లిలో ఈ నెల 16వ తేదీన హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ప్రశాంత్‌నగర్‌లో, శివాంజనేయ దేవాలయం ఆవరణలో హిందూ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందూ బంధువులు, వివిధ బాధ్యత గల గ్రూపుల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమం విజయానికి తమ మద్దతు తెలిపారు. ఈ నెల 16వ తేదీన శివరాంపల్లి వేధికగా హిందూ బంధువుల ఐక్యతతో సాయంత్రం 5.30 గంటలకకు ఊర చెరువు బుధవారం మార్కెట్ గ్రౌండ్స్ శివారంపల్లి జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల పక్కన ఈ హిందూ సమ్మేళనం ద్వారా ధర్మ పరిరక్షణ, సమాజ ఐక్యత, హిందూ సంస్కృతి వైభవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి హిందూ బంధువును మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# కాంగ్రెస్ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు ఒక్కటైయ్యారు

## బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్‌లను తొలగించడం హేయమైన చర్య

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్‌రెడ్డి






**గండిపేట(క్రైం మిర్రర్):** కాంగ్రెస్ నాయకులు, జీహెచ్ఎంసీ అధికారులు ఒక్కటై బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్‌లను తొలగిస్తున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆరోపించారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెలంగాణ రాష్ట్రానికి వచ్చి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ చేపట్టిన భారీ బహిరంగ సభ నేపథ్యంలో నాయకులు భారీగా నరేంద్రమోడీకి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. వీటిని రాత్రికి రాత్రి జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పార్టీ ప్రచార సామాగ్రిని టార్గెట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో జీహెచ్ఎంసీ అధికారులు పని చేస్తున్నారనే అనుమానం ప్రజల్లో పెరుగుతుందన్నారు. అధికార దుర్వినియోగంతో బీజేపీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీయాలని ప్రయత్నిస్తే పార్టీ నిశబ్ధంగా ఉండదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీకి సమాన హక్కులు ఉన్నాయన్నారు. అనుమతులతో ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించడం పూర్తి అన్యాయం అన్నారు. ఇదే విధంగా కొనసాగితే జీహెచ్ఎంసీ కార్యాలయాల వద భారీ స్థాయిలో ప్రజాస్వామ్య బద్ధ నిరసనలు, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. కేవలం బీజేపీ పోస్టర్లపైనే చర్యలు తీసుకోని ఇతర పార్టీల ఫ్లెక్సీలను వదిలేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. బీజేపీ నాయకులను రెచ్చగొట్టే చర్యలు వెంటనే ఆపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి ఈ వివక్షపూరిత చర్యలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.




# కల్లాల్లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చెయ్యాలి

## ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలి -మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని, కల్లాల్లో వరి కుప్పలు పోసి నెల రోజులు గడుస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత దయనీయమని, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మర్రిగూడ మండలంలోని పలు కల్లాలను సందర్శించి, రైతుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, రైతులు కళ్ళల్లో నీళ్లు పెట్టుకుని తమ బాధలను చెప్పుకుంటుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆకాశం మేఘావృతమై వర్షాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని, నల్లరేగడి భూములు కావడం వల్ల ఒక్కసారి వర్షం పడితే కనీసం ట్రాక్టర్లు, లారీలు కూడా లోపలికి రాలేని పరిస్థితి ఏర్పడి, ధాన్యం మొత్తం మొలకలు వచ్చే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ధాన్యం కల్లానికి రాగానే, కొనుగోలు చేసి వారం రోజుల్లోనే రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేసేవారమని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో, రైతులు నెల రోజులుగా ఎదురుచూడాల్సి రావడం దురదృష్టకరమని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో సీరియల్ నంబర్లు ఇచ్చినా అవి ముందుకు సాగడం లేదని, 250 సీరియల్ నంబర్లు ఉంటే ఇప్పటికీ కేవలం 70 మాత్రమే పూర్తి కావడం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. క్వింటాల్‌కు 42 కిలోలు తూకం వేస్తూ, తరుగు పేరిట రైతులను దోచుకుంటున్నారని, మిల్లుల వద్ద కూడా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే తన నియోజకవర్గ రైతుల సమస్యలను గాలికొదిలేసి, కేవలం మంత్రి పదవి కోసం ఢిల్లీలో పైరవీలు చేస్తూ గడ్డాలు, మీసాలు పెంచుకుంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. గడ్డాలు పెంచితేనో, క్యాంపు కార్యాలయాలు కూలగొడితేనో పదవులు రావని, రైతుల కన్నీళ్లు తుడిచినప్పుడే నిజమైన ప్రజా నాయకుడిగా గుర్తింపు ఉంటుందని హితవు పలికారు. సివిల్ సప్లైస్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రులు ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని, ఎటువంటి కోతలు లేకుండా ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల గోస చూస్తుంటే భవిష్యత్తులో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయకపోతే, మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో రైతుల పక్షాన భారీ ఎత్తున 'మహాధర్నా' నిర్వహిస్తామని ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి, వారి ఖాతాల్లో వెంటనే సొమ్ము జమ చేసే వరకు తాము విశ్రమించబోమని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు

## రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల:బండి సంజయ్ కుమార్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారంవల్లే ఆయన తండ్రి కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కేటీఆర్‌ను చూసి బీఆర్ ఎస్ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రధాని రాక సందర్భంగా బండి నేతృత్వంలో ఆర్టీసీ ఎక్స్‌రోడ్ నుంచి అమీర్‌పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేటీఆర్ మాదిరిగా దోచుకోవడం నాకు తెలియదు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం నాకు తెలియదు..డ్రగ్స్ తీసుకోవడం నాకు తెలియదు..కాళేశ్వరం, ఈ-ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి మాకు తెలియదు..ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు, మంది కొంపలు ముంచడం అసలే తెలియదు, ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకునేలా చేయడం మాకు తెలియదు, మాకు ఏం తెలుసో ప్రజలు నిర్ణయిస్తారు. మీకు ఏం తెలుసో ప్రజలు గ్రహించి మిమ్మల్ని ఓడించారు అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అహంకారం చూపించి, ఇప్పుడు అధికారం పోయాక కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కాళ్లు మొక్కుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఏం చేసినా రాష్ట్రంలో ఇక అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు.

# విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి

## మే 11 నుండి 17 వరకు విద్యా వారోత్సవాలు..... యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి జిల్లా, మే 10, క్రైమ్ మిర్రర్ :** మే 11 నుండి 17 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఘనంగా "విద్యా వారోత్సవాలను " తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు జిల్లావ్యాప్తంగా 'విద్యా వారోత్సవాలను' అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి మరియు మౌళిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడానికి ఈ ఉత్సవాలు ఒక వేదికగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.



**రోజు వారీగా చేపట్టే కార్యక్రమాల వివరాలు...**

ౖమే 11 సోమవారం జిల్లాలోని పాఠశాలల్లో పూర్తయిన సివిల్ పనుల ప్రారంభోత్సవం మరియు మంజూరైన కొత్త పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అలాగే సృజనాత్మక వేసవి శిబిరాలను జిల్లాలోని 17 పీఎంశ్రీ పాఠశాలలలో ఘనంగా ప్రారంభిస్తారు. రాజపేట మండలంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ రాజపేట పాఠశాలలో అదనపు తరగతి గదులు మరియు సైన్స్ ల్యాబ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రభుత్వ విప్ మరియు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టరు, జిల్లా విద్యాశాఖాధికారి సమక్షంలో నిర్వహించబడుతుంది. అలాగే జిల్లాలోని వివిధ మండలాల్లో టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, నాబార్డ్ పనులు తదితర మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించబడనున్నాయి.

- మే 12 మంగళవారం పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం 'రెమెడియల్ క్యాంపులు' ప్రారంభోత్సవం. ఫెయిల్ అయిన విద్యార్థులందరూ సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించేలా అవగాహన కల్పిస్తారు.
- మే 13 బుధవారం నియోజకవర్గ స్థాయిలో సర్పంచ్‌లు, మున్సిపల్ వార్డు సభ్యులతో వర్క్‌షాప్. ప్రభుత్వ విద్యా పథకాల్లో స్థానిక సంస్థల భాగస్వామ్యం, 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల' పాత్రపై చర్చ ఉంటుంది.
- మే 14 గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' ర్యాలీలు మరియు తల్లిదండ్రుల సమావేశాలు మెగా పీటీమ్ నిర్వహణ, ఉత్తమ హాజరు కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాల పంపిణీ మరియు వంటల పోటీలు నిర్వహిస్తారు.
- మే 15 శుక్రవారం జిల్లా, మండల గ్రంథాలయాల్లో 'గ్రంథాలయ దినోత్సవం'. పుస్తక ప్రదర్శనలు, ఉత్తమ పాఠకులకు గుర్తింపు వంటి కార్యక్రమాలు చేపడతారు.
- మే 16 'కళా వైభవం' పేరుతో సాంస్కృతిక దినోత్సవం. కోలాటం, లంబాడీ నృత్యం, ఒగ్గు కథ వంటి జానపద కళల ప్రదర్శనలు మరియు విద్యార్థుల చిత్రలేఖన ప్రదర్శనలు ఒక పీఎంశ్రీ పాఠశాల నందు ఉంటాయి.
- మే 17 ఆదివారం 'విద్యా విజయోత్సవం' - ముగింపు వేడుకలు. జిల్లా స్థాయి టాపర్లు పదవ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడలు 9 మందికి ఒక్కొక్కరికి రూ. 10,000 నగదు బహుమతి మరియు ప్రశంసా పత్రాలతో సత్కారం ఉంటుంది.
- ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# బొద్దుల సదానందం పార్థివదేహానికి మాజీ మంత్రి బోడ జనార్ధన్ నివాళి

## తీర్థయాత్ర నుంచి వస్తుండగా రైలులో గుండెపోటుతో మృతి

## కుటుంబ సభ్యులను పరామర్శించిన వివిధ పార్టీల నేతలు



**రామకృష్ణాపూర్ మే 10 (క్రైమ్ మిర్రర్) :** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, కార్మిక శ్రమశక్తి అవార్డు గ్రహీత బొద్దుల సదానందం (70) మృతి పట్ల మాజీ మంత్రి, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బోడ జనార్ధన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సింగరేణి రిటైర్డ్ హెడ్ ఓవర్‌మెన్‌గా పనిచేసిన సదానందం ఇటీవల చార్‌ధామ్ తీర్థయాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో శుక్రవారం రైలులో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే.ఆదివారం ఆయన పార్థివదేహాన్ని నివాసం వద్ద సందర్శించిన బోడ జనార్ధన్, టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్ కుమార్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పార్థివదేహంపై పార్టీ జెండాను కప్పి 'సదన్న అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సదానందం జీవితాంతం తెలుగుదేశం పార్టీ, టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం బలోపేతానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కార్మిక శ్రమశక్తి అవార్డు అందుకోవడం ఆయన సేవలకు నిదర్శనమన్నారు.సింగరేణిలో దీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన అనంతరం కూడా భూపాలపల్లి జిల్లా తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో ప్రైవేట్ వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ చురుగ్గా ఉండేవారని తెలిపారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ తీర్థయాత్రకు వెళ్లిన క్రమంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన మృతి తెలుగుదేశం పార్టీకి, కార్మిక లోకానికి తీరని లోటని పేర్కొన్నారు.సదానందం కుటుంబాన్ని పరామర్శించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, టీడీపీ సీనియర్ నాయకులు వై.ఉమామహేశ్వరరావు,బీఆర్ఎస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహంకాళి శ్రీనివాస్, వోడ్నాల శ్రీనివాస్, పల్లె రాజు, గాండ్ల సమ్మయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా, మండలవారీగా, షాద్నగర్, కేశంపేట, కడ్తాల్, కందుకూరు, కొత్తూరు, తలకొండపల్లి అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు.
Email ID: crimemirrorts@gmail.com
9393 44 6188

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.